# నీడలో దాగిన నిజం

—శ్రీకాంతి

హాస్పిటల్ బెడ్‌మీద వాలి అలసటగా కళ్ళుమూసుకున్నాను. నిద్ర పోవడానికి ప్రయత్నించాను. కాని ఏమిలాభం లేకపోయింది.

ఇంతలో పాప ఏడుపు వినిపించింది

నిశ్శబ్దంగాలేచి. పాపను గుండెలకు హత్తుకున్నాను.

పాపను అలా పరీక్షగా చూస్తున్న నాలో, నాకే తెలియని నిరాశ, నిస్తబ్ధత చోటు చేసుకున్నాయి.

నేనేమన్నా పదిమందిలో "ఓహో" అని అనిపించుకునేంత అందగత్తెను కాకున్నా, భగవంతుని దయవల్ల అనాకారిని మాత్రంకాను. కనీసం నా పోలికలైనా వచ్చివుంటే, పాప ఓ మాదిరిగా ఉండేదేమో. కానీ....

అయినా అందనివాటిని గురించి అర్రులు చాచడం కేవలం, అవివేకమే అవుతుంది. నా పిల్లలు పదిమందిలో ప్రత్యేకంగా ఉండాలని నేను అనుకోవచ్చు, కాని అదెలా సాధ్యమవుతుంది? ఏ రకంగా వాళ్ళు ప్రత్యేకంగా చూడబడతారు??

పాపను ఉయ్యాల్లో పడుకోబెట్టి, బెడ్‌మీద కూర్చున్నాను. హాస్పిటల్ చూసినవాళ్ళు, వేరే ఏ నరకానికీ వెళ్ళి చూడక్కర్లేదేమో!

భరించలేని కంపు. రోగుల ఆర్తనాదాలు, ఆ మూలుగులు.... ఎప్పుడెళ్ళి పోవాలో యింటికి. ఇంకోమూడు రోజులు ఈ నరకం భరించక తప్పదు.

"ఏమండీ" ఉలిక్కిపడి చూశాను.

"మీ పాప పడుకుందల్లేఉంది. ఈ గదిలోకిరండి కాసేపు కూర్చుందురు...."

లేచి ఆ గదిలోకి వెళ్ళాను. ఆవిడ స్పెషల్ వార్డులోఉంది, ఆవిడున్న

ఆ గదికీ, నా బెడ్‌కూ మధ్య ఒక్క కిటికేవుంది.

"బలే బోరు వుతుందండీ" విసుగ్గా ముఖంపెట్టి అంది ఆమె నేను నవ్వి ఊరుకున్నాను.

"మీరు ఈ హాస్పటల్‌కు ఇంకో రెండుగంటలకు వస్తారనగా, నేను వచ్చి చేరాను" . .తన్నుతాను పరిచయం చేసుకుంటున్నట్టుగా అంది.

"అంటే, మీరుకూడా రాత్రి చేరారన్నమాట" అన్నాను.

"మీకుకూడా మొదటి కాన్పేమిటి"? బత్తాయి పండు వలుస్తూ మధ్యలో హఠాత్తుగా అంది.

చిన్నగానవ్వి తలూపాను.

ఆవిడను చూస్తుంటె, ఇవి అని చెప్పలేని భావాలేవో నన్ను కలిచి వేస్తున్నాయి.

ముట్టుకుంటె కందిపోతుందేమో అన్నంత సుకుమారంగా, బ్రహ్మ తన నేర్పునంతా వినియోగించి చేసిన అందాల సుందరిలా ఉందావిడ.

"మా బాబును చూడరూ" అంది నవ్వి.

నేనులేచి ఉయ్యాలదగ్గరికి వెళ్ళాను.

బాబును చూస్తున్న నా కళ్ళు, ఆశ్చర్యంతో విప్పారి, అదే అవస్థలో కొన్సేపుండిపోయాను.

గులాబిరంగుతో, నల్లటి జుట్టుతో, పెద్దకళ్ళతో ఎంత అందంగా ఉన్నాడో చెప్పలేను.

---

*PLEASE VISIT*

# GANESH MEDICAL HALL

**CHEMISTS & DRUGGISTS**

**OPP. TOWN POLICE STATION, NALGONDA.**

**FOR**

FRESH MEDICINES WITH CHEAPER RATES

*PLEASE VISIT*

**THE FURNITURE & PAINTING WORKS**

**NALGONDA**

FOR

THE BEST FURNITURE & QUALITY PAINTING WORKS., MANUFACTURES DEALERS & GOVT. CONTRACTOR

*(Regb No. 79 SSI IND 70)*

**Prop. Mohd. Jahangir Ali**

"నాలాగే ఉన్నాడండి బాబు" నవ్వీనవ్వనట్టు నవ్వి అంది.

"నాకట్టుకు నాకైతే అలా అన్పించలేదండీ" మామూలుగా అన్నాను.

నేనుకూడా అలాగే అనుకున్నానండీ. అంతా మా వారిలాగే ఉంటాడేమో" ఆ మాట అంటున్న ఆవిడ కళ్ళల్లో ఏదో వెలుగు.

ఇంక అక్కడ ఉండడం నాశక్తికిమించిన పనైపోయింది.

"కాస్సేపు కూర్చోండి, అపుడే ఏంవెళతారు" అని ఆవిడ అంటున్నా వినిపించుకోకుండా వచ్చి, బెడ్ మీదవాలి, కళ్ళుమూసుకున్నాను. అప్పటినుండీ నా మనస్సులో మెదలిన భావాల కేదో రూపు వచ్చినట్టుగా ఉంది.

ఆవిడను చూస్తుంటే చెప్పలేనంతగా ఈర్ష్యగా అనిపించింది "ఏమిటే, పిల్ల ఏడుస్తుంటే ఏం నిద్ర అది. లే. లేచిపాలివ్వు" ఎప్పుడొచ్చిందో ఏమో? అమ్మమ్మ అంది.

ఒక్కసారి అమ్మమ్మకేసి చూసి, ఇటుతిరిగి కళ్ళుమూసుకున్నాను. పాపను ఎత్తుకోవాలనిపించలేదు.

ఎందుకు అంటే సమాధానం నాకే తెలియని అశక్తత.

ఎప్పుడు నిద్రపట్టిందో ఏమో? పక్కగదిలోంచి నవ్వులు వినిపించి మెలకువ వచ్చింది. కళ్ళు కొద్దిగా తెరచి చూశాను, మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

ఉయ్యాల దగ్గర ఆమె, ప్రక్కగా ఎవరో "అతను" బహుశా ఆమె భర్తేమో. ఒకచెయ్యి ఆమె భుజంచుట్టూవేసి, ఆమెను పొదివి పట్టుకున్నాడు.

చూడకూడదనుకుంటూనే చూశాను.

"ఎవరి పోలికండీ అమ్మాయిగారు. నాతో ఛాలెంజి చేశావుగా పాపే పుడుతుందనీ, నీపోలికలే వస్తాయని, ఇప్పుడేమంటావ్"

సమాధానంగా ఆమె కిలకిల నవ్వింది.

"నాకు రాత్రి ఎంత భయంవేసిందో తెలుసా? మళ్ళీ అటువంటి రోజు జీవితంలో రాకూడదనుకున్నాను. అసలు నిన్ను మళ్ళీ ఇలా చూస్తాననుకోలేదు. ఇంకమనకు పిల్లలు అక్కరలేదు. అవునా మధూ"!

అలా మాట్లాడుతున్న అతని కళ్ళల్లో ఎంతో ఆప్యాయత?

"ఒకపాప వద్దేమిటి మనకు?" చిలిపిగా అడిగిందామె.

"ఇంకా పాపెందుకు"

"ఇదివరకున్నట్లే మాట్లాడుతున్నారే?

మరి నువ్వు నాపాపవు కావేమిటి "అల్లరిగా అన్నాడు.

*Please Visit*

# Balaji Radio House & Electrical Store,

**DEALERS**

MURPHY RADIOS & TRANSISTORS, NELCO RADIOS & TRANSISTORS, ORIENT FANS & MOTORS, RALLIES FANS, KLEERTONE APPLIANCES, ALL KINDS OF STEEL FURNITURE AND PRESTIGE & HOME COOKERS

New Bus Stand : : **NALGONDA. A. P.**

"ఆహా ఇకనుండి తమరి ఆటలు సాగవండీ వీడున్నాడు మరచిపోకండ "బ్బాయిగారు" చిలిపిగా అందామె.

"వాడు మనపార్టేనండీ"........"మరి వెళ్ళిపోయే ముందు." "నా...."

"ఇదిగో ఇలా చేస్తే నేనూరుకోను .... చెప్పానుగా తమరింక కొంచె వేళాలు మానెయ్యాలని........"

ఆమె మాటలు పూర్తికాకుండానే అతడు, ఆమెను రెండు చేతుల్తో బంధించి నుదుటిమీద ముద్దుపెట్టుకున్నాడు.

భగ్గున మండింది నా హృదయం.

అతను బయటకు వెళ్ళి, స్కూటరు స్టార్టుచేస్తూ చెయ్యి ఊపాడు. కిటికీ దగ్గర నిల్చున్న ఆమెనుచూసి నవ్వుతూ.

నేను అసహనంగా పక్కకు తిరిగాను.

ఆవిడను చూస్తుంటే ఏదో తెలియని అసూయ.

ఏమున్నాయి నా జీవితంలో, తలుచుకొని సంతోషపడే అనుభూతులు? ఒక్కనాడైనా తనను ఆలా దగ్గరికి తీసుకొని లాలించాడా తన భర్త.

తనను కేవలం వండి వార్చే యంత్రంగా మార్చివేశాడు. తానేమీ మేడలూ కార్లూ, షికార్లూ, వంటినిండా నగలూ కోరుకోలేదే!


## జగిని లక్ష్మయ్య & సన్స్

ఎరువులు, మందులు మరియు బర్మాషెల్ డీలర్సు

ప్రేమ్ టాకీసు రోడ్డు, నల్లగొండ.

గ్రోమోర్ 28: 28: 0, 22: 22: 11, అమ్మోనియం సల్ఫేటు, కాల్సియం, ఫాస్ఫం ఫాస్, N. P. K. 14: 28: 14 & 15: 15: 15

మొదలగునవి లభించును.

భర్తనుండి తియ్యటి అనుభూతులు కోరుకుంది తప్పా !

కాని, అతను మాత్రం ఏంచేస్తాడు ? అలాంటి వాతావరణానికే ఎంతో దూరంలో పెరిగాడు.

అతనికి అలాంటి లాలింపులూ, కవ్వింపులూ ఎలా తెలుస్తాయి ?

"ఎలా ఉంది ఒంట్లో" ఎప్పుడొచ్చాడో ?స్టూలుమీద కూర్చుని అడిగాడు.

ఏదో అడగాలికదా అని అడిగినట్లనిపించింది.

"బాగానేవుంది" పొడిగా అని పక్కకు తిరిగాను.

ఐదు నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చుని, తర్వాత లేచాడు వెళ్తానంటూ, వేళ్తూవెళ్తు పాపకేసి పరిశగా చూచాడు.

అతని ముఖంకేసి ఆత్రృతగా చూచాను. నాకు కావల్సింది దొరుకుతుందే మోనని.

కాని అతనిముఖం అతి మామూలుగావుంది.

నిట్టూర్చి కళ్ళు మూసుకున్నాను.

"పడుకున్నారల్లేవుందే" అమమ్మతో వారంటున్న మాటలు వినిపించాయి.

ఆవిడతో మాట్లాడనికి మనస్సంగీకరించలేదు.

అసలావిడను తలుచుకుంటేనే ఒళ్ళు మండుతుంది.

ఏదోకసి, ఎందుకొ తెలియనికసి, ఏదో చెయ్యాలనే కసి....

ఎందుకింత బలహీనమవుతుందో ఈ మనసు !

మనస్సుకు నిగ్రహించుకోగలిగే శక్తివుంటే ఎంత బాగుండును ? ఈర్ష్యా ద్వేషాలకు అతీతంగా వుండిపోగలిగితే....

సాయంత్రం అయ్యింది.

తలనిండా కొంగు కప్పుకుని, బయటకువచ్చి నిల్చున్నాను.

"ఏమండీ మీరు ఇక్కడున్నారా ? మీకోసమే వచ్చాను"

నవ్వుతూ అంది ఆమే.

బలవంతాన నవ్వు తెచ్చుకున్నాను

"నేను వెళ్ళిపోతున్నానండి. వెళ్ళేముందు మీతోచెప్పి వెళ్దామని....

మీ పాపకు ఈ గౌను వెయ్యండి. ఉదయం వారు వెళ్తుంటే చెప్పాను. ఇప్పుడు తెచ్చారు. మీరు వద్దంటే పూర్త్రం ఊరుకోను. ఆలస్యం చేస్తే వారు కోప్పడతారు. వెళ్తానండీ" పాకెట్ నా చేతిలోపెట్టి వచ్చినంత వేగంగాను వెళ్ళిపోయింది.

ఆ పాకెట్ తిరిగి ఇవ్వాలనుకుని వెళ్ళిన నాకు దూరంగా కదలి పోతున్న టాక్సీ కనిపించింది.

విసుగ్గా ఆపాకెట్ బెడ్ మీద పడేశాను.

"ఏమిటే, చెప్తే వినిపించుకోవేం. పాలు పట్టవే పిల్లకు"

అమ్మమ్మ విసుగ్గా అంది.

నేనేం పట్టనుపో, ఆ డబ్బా పాలు కలిపి పట్టు" అంతకంటే విసురుగా అని బయటకు వచ్చాను.

చెప్పలేనంత నీరసంగా అనిపించింది.

మనస్సంతా పిచ్చిగా, అల్లకల్లోలంగా ఉంది.

---


ఒక్క సారి దయచేయండి!

## శ్రీ వేంకటేశ్వర వస్త్రాలయము

బస్ స్టాండు రోడ్డు, నల్లగొండ

మా వద్ద:—

హాండ్ లూమ్ టెరికాట్, టెరీ వూల్ మరియు మిల్లు టెరికాట్,

టెర్లిన్, మఫత్ లాల్ గ్రూప్, షర్టింగులు, సూటింగులు,

అన్ని రకములైన అందమైన చీరలు

సరిక్రొత్త డిజైనులలో, సరసమైన ధరలకు లభించును.

ప్రోప్రైటరు: వీరమళ్ళ శ్రీరాములు.

ఆవిడతో పోల్చుకొని బాధపడితే మాత్రం లాభం ఏమిటి ?

కాని నాలోని వివేకాన్ని ఏవో వికృత శక్తులు అణగదొక్కుతున్నాయి.

ఏమో తల్లి. నీ ఇష్టం. చెప్తే వినడం నీకెప్పుడుంది. నేను వెల్తున్నాను. వంట చేసిపెట్టి మళ్ళీ వస్తాను. అలా చల్ల గాలిలో నిలబడకు జలుబు చేస్తుంది."

అమ్మమ్మ వెళ్ళిపోయాక వచ్చి, పక్కమీద బోర్లాపడుకుని దిండులో తల దూర్చాను.

"పార్వతీ పాప ఏడుస్తుంది" వుయ్యాల దగ్గరిగా నిల్చుని అన్నాడు రావు

నేనేమీ సమాధానం చెప్పకుండా అలాగే పడుకున్నాను.

రేపు ఇంటికి వెళ్ళేరోజు ఈ హాస్పటల్ నుండి ఎప్పుడు బయట పడాలా అని వుంది.

మధ్యాహ్నం కావటంతో హాస్పటల్ అంతా నిశ్శబ్దంగా ఉంది. క్యారియల్ తీసుకొని అమ్మమ్మ అప్పుడే వెళ్ళిపోయింది. ఏమి తోచలేదు నిద్రపోవాలని నేను చేసిన ప్రయత్నమంతా విఫలమైంది.

నాకు దగ్గరగా వేరే పేషంట్సుకూడా ఎవరు లేరు ఆ విశాలంగా వున్న వార్డులో, చివ్వరికి ఆమూలగ నలుగు రైదుగురున్నారేమో !

"నిద్ర పట్టలేదా తల్లీ " అని పలకరించింది నాలుగైదు బెడ్సుకు అవతల ఉన్నావిడ ఉదయం చేరిందల్లేవుంది.

"లేదమ్మా" అన్నాను నవ్వి.

ఎందుకో ఆవిడ దగ్గరకు వెళ్ళి మాట్లాడాలనిపించింది

"ఎవరవ్వా యీావిడ నీకూతురా" మంచంమీద పడుకున్న ఆమెను పరీక్షగా చూస్తూ అడిగాను. ఒక పక్కకి వత్తిగిలి ఉండటంలో సరిగా కన్పించలేదు.

ఇప్పుడు నన్ను పలకరించినావిడ కింద ఒక పక్కగా కూర్చొని ఉంది.

కాదమ్మ మా గుడిసె పక్కనే దీనిగుడిసే ఉంది. కాని దీని మొగుడో రాకాసి ముండాకొడుకమ్మా. ఎప్పుడూ తాగొచ్చి దీన్ని తంతావుంటాడు, రిచ్చ తొక్కుతాడు ఆడు. ఈ మద్దిన ఏమొచ్చిందో ఏమో. ఎవతినో ఇంకో పెండ్లిచేసుకొని, దీన్ని ఇడిశిపెట్టి పోయిండు దీనికి తల్లీ తండ్రీలేరు. పక్కకున్న కాబట్టి, నిన్నటినుండి నొప్పులబడుతుంటే సూడలేక తీసుకొచ్చిన

ఈవిడ వాక్ప్రవాహానికి మంచంమీద పడుకున్న ఆమె కొద్దిగా కదిలింది. దుప్పటి జారిపోయింది.

ఆ తల్లి పిల్లకేసి చూస్తున్ననేను అప్రయత్నంగా రెండడుగులు వెనక్కి వేసాను. నల్లటి నలుపు, బారెడుముక్కు, నాలుగు పళ్ళు పూర్తిగా బయటకే ఉండి మహా వికృతంగా ఉందా మనిషి.

చీపురు పుల్లలాంటి కాళ్ళూ చేతులూ, బానెడు పొట్ట వెతికితేకాని కనపడని కండ్లు —భయంకరంగా ఉన్నాడా పిల్లాడు. మంచం కిందున్నావిడ ఏకదాటిగా ఏదో చెప్తూనే ఉంది. కాని అదేమీ వినిపించుకోకుండా పరుగులాంటి నడకతో నా బెడ్ దగ్గరికి వచ్చి పడ్డాను.

పాప ఎప్పుడు కనిపించనంత అందంగా కనిపించింది. చటుక్కున పాపను హృదయానికత్తుకుని ముద్దులతో ముంచెత్తాను.

అప్పుడే వచ్చిన అమ్మమ్మ నాకేసి విచిత్రంగా చూస్తుంది.

"అమ్మమ్మా ఇదిగో ఈ పాకెట్ తీసికెళ్ళి, ఆ బెడ్ మీద ఉన్నావిడకు ఇచ్చిరా"

పాకెట్ ఇచ్చాను అమ్మమ్మకు

మనస్సంతా తేలికగా, చెప్పలేనంత హాయిగా అన్పించింది. పాపను గుండెలకు హత్తుకొని "నేనుకూడ అదృష్టవంతురాలినే" అని అస్పష్టంగా గొణుక్కున్నాను. అమ్మమ్మ నాకేసి వింతగా చూస్తూ అలా విస్తుపోయి నిల్చుంది.

---


# గీతా జనరల్ స్టోర్సు

స్టేషనరీ మరియు బుక్ సెల్లర్సు నల్లగొండ ఆం. ప్ర.

మా వద్ద :—

అన్నిరకముల పుస్తకములు, మొదటి తరగతి నుండి పదవ తరగతి వరకు మరియు కాలేజి పుస్తకములు ఇంకా...... .....

"జీప్" సెల్‌ఎలు, టార్చి లైట్లు వివిధ రకములయినవి

"రాజు" ఇంక్సు అన్ని రంగులలో లభించును.

దర్శించండి